# రైతాంగ దుస్థితిని ప్రతిబింబిస్తున్న జాతీయ నమూనా సర్వే నివేదిక

**సాగునీరు,** పెరుగుతున్న సేద్యపు ఖర్చులు, సంస్థాగత రుణాలు అందకపోవటం, పంటలకు న్యాయమైన ధరలు లభించకపోవటం, మార్కెట్ సౌకర్యం లేకపోవటం అన్నవి రైతాంగం ఎదుర్కొంటున్న మౌలిక సమస్యలని, ఈ సమస్యలను పాలకులు పరిష్కరించక పోవటం వలనే రైతాంగం సంక్షోభంలో కూరుకుపోయి బలవన్మరణాలకు పాల్పడుతున్నారని "జనశక్తి" నిరంతరం తెలియచేస్తూనే ఉంది. "జనశక్తి" చెప్పే విషయాలు ఎంత వాస్తవమో జాతీయ నమూన సర్వే గణాంకాలను పరిశీలిస్తే స్పష్టమౌతుంది.

జాతీయ నమూనా సర్వేలో భాగంగా వ్యవసాయ రంగంపై ప్రత్యేక అధ్యయనం జరిగింది. 2014 సంవత్సరంలో వ్యవసాయ కుటుంబాలపై ఒక నివేదిక వచ్చింది. అదే కాకుండా మరో మూడు అధ్యయనాలు చేయాలని జాతీయ నమూనా సర్వే నిర్ణయించింది. అందులో భాగంగా 107 పేజీలతో గత సంవత్సరం రెండవ నివేదిక అందచేసింది. ఇందుకోసం దేశం మొత్తం మీద 4,529 గ్రామాల్లోని 35,200 వ్యవసాయ కుటుంబాలను కలిసి వివరాలు సేకరించింది. ఈ సేకరణలో భాగంగా తెలంగాణా రాష్ట్రంలోని 97 గ్రామాల్లోనూ, ఆంధ్రప్రదేశ్‌లోని 149 గ్రామాల్లో 1164 కుటుంబాలు ఈ సర్వే సేకరణలో భాగం పంచుకున్నాయి. దేశవ్యాపితంగా కుటుంబాల సర్వే ఆధారంగా నివేదికను విడుదల చేసింది. రైతాంగం ఎదుర్కొంటున్న మౌలిక సమస్యలకు నివేదిక అద్దం పట్టింది. మద్దతు ధరలు, సాగునీరు, మార్కెట్ విధానం, ఎరువులు, విత్తనాలు, పంటల బీమా పథకం, సంస్థాగత రుణాల తీరుతెన్నులను వెల్లడించింది.

దేశంలోని చాలామంది రైతులకు పంటల కనీస మద్దతుధరల గురించి అవగాహనలేదని, రైతులు పండించిన ధాన్యాన్ని అమ్ముకోవటానికి సేకరణ సంస్థ లేదని, స్థానికంగా కొనుగోలు చేసే సౌకర్యంలేదని, యాభైశాతం పైగా బయటే అమ్ముకొంటున్నారని, మార్కెట్‌లో వరికి కూడా కనీస మద్దతు ధరకన్నా ఎక్కువ లభించటంలేదని, పంట తనఖా పెట్టి అప్పులు తెచ్చుకొన్నవారు పంటలను వారికే విక్రయిస్తున్నారని నివేదిక వెల్లడించింది. నివేదికలో రైతాంగం పంటలు విక్రయించిన విధానం గురించి వివరించింది.

ఈ పట్టికలో ఒక్క చెరకుపంట మినహా అన్ని పంటలను ప్రభుత్వసంస్థలు కొనుగోలు చేస్తున్నది నామమాత్రమేనని స్పష్టమౌతున్నది. స్థానిక వ్యాపారులకు, మండిల్లో అమ్ముకుంటున్నది 80 శాతం దాకా ఉంది. ఇది గమనిస్తే మార్కెట్ శక్తులకు రైతాంగం ఏవిధంగా బందీ అయ్యిందీ అర్థమౌతుంది. రైతుల నుండి పంటలను కొనుగోలుచేసి వారిని ఆదుకొనే విధంగా ప్రభుత్వసంస్థలు, ఏజన్సీలు వ్యవహరించటంలేదు. తమ పంటలను అమ్ముకోవటానికి, నిల్వచేసుకోవటానికి రైతాంగానికి ఉపయోగపడే మార్కెట్ యార్డులను ప్రైవేటీకరించే విధానాలను ప్రభుత్వాలు చేపడుతూ వస్తున్నాయి. ఇప్పటికే అనేక కమిటీలను కుదించటం జరిగింది. సేద్యపు ఖర్చులకు సంస్థాగత రుణాలు అందకపోవటం వలన, ప్రైవేటు వ్యాపారులు అధికవడ్డీలకు, వారు పెట్టిన షరతులకు ఆమోదం తెలిపి అప్పు తీసుకొని అందుకు అనుగుణంగా పంట చేతికి వచ్చిన వెంటనే వారికే విక్రయించుకోవాల్సి రావటం రైతాంగం యొక్క దయనీయమైన పరిస్థితికి అద్దం పడుతున్నది. ప్రభుత్వం ప్రకటిస్తున్న మద్దతు ధరలు కూడా రైతాంగ ప్రయోజనాలను ప్రతిబింబించటం లేదు. పెరుగుతున్న పంట ఖర్చులను పరిగణలోకి తీసుకొంటే, ప్రతి సంవత్సరం పెంచే మద్దతుధర సముద్రంలో నీటిబొట్టులా ఉంది. రైతాంగానికి ఏమాత్రం ఊరట కలిగించటంలేదు. 2009-10 సంవత్సరంలో సాధారణ వరి ధాన్యం క్వింటాల్‌కు మద్దతుధర 1000రూ. ఉండగా 2015-16 సం॥లో 1410 రూపాయలుగా ఉంది. పంట ఖర్చులు 15 వేల నుండి 25 వేల రూపాయలకు పెరిగింది. దీన్ని గమనిస్తే పంట ఖర్చులు విపరీతంగా పెరుగుతుంటే మద్దతు ధర పెంపు మాత్రం కన్నీటి బొట్టులాగా ఉంది. ప్రస్తుత మద్దతుధర ప్రకారం అంతా సవ్యంగా ఉండి 24 క్వింటాళ్ళ దిగుబడి వచ్చినా రైతాంగానికి మిగిలేది అతి స్వల్పమే. సాధారణరకం ధాన్యాన్ని మద్దతుధరకు వ్యాపారులు కొనుగోలు చేయటంలేదు. ప్రభుత్వ సంస్థలు ముందుకురావటంలేదు. ఫలితంగా రైతాంగం తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ పరిస్థితుల్లో చేసిన అప్పులుతీరక, వడ్డీవ్యాపారుల ఆగడాళ్ళు భరించలేక రైతులు బలవంతంగా ప్రాణాలు తీసుకోవాల్సిన పరిస్థితికి పాలకులు నెడుతున్నారు.

నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు వాటి లభ్యత గురించి కూడా నివేదికలో పేర్కొన్నారు. ఎరువుల కోసం 71.1 శాతం మంది రైతులు, పురుగుమందుల కోసం 81.4 శాతం మంది రైతులు స్థానిక వ్యాపారుల, షావుకార్ల, డీలర్ల మీద ఆధారపడు తున్నారని, ప్రభుత్వసంస్థలు ద్వారా అవి నామమాత్రంగానే అందుతున్నాయని నివేదిక వెల్లడించింది. విత్తన సేకరణ ఏవిధంగా చేసుకొంటున్నదీ నివేదిక పేర్కొంది. రైతాంగం చేసుకొంటున్న విత్తన సేకరణ ఈవిధంగా ఉంది.

పైన పేర్కొన్న విత్తనసేకరణను గమనించినట్లయితే ఇప్పటికీ ప్రధాన పంటలకు సంబంధించిన విత్తనాలను వెయ్యిమందిలో 200 నుండి 500 మంది రైతులు తాము పండించిన పంటల నుండే సమకూర్చు కొంటున్నారు. అంతే మొత్తంలో స్థానిక వ్యాపారుల నుండి కొనుగోలు చేస్తున్నారు. 19 నుండి 69 మంది మాత్రమే ప్రభుత్వ సంస్థల నుండి సేకరిస్తున్నారు. నాణ్యమైన విత్తనాలు కూడా రైతాంగానికి ప్రభుత్వసంస్థలు అందించలేకపోతున్నాయి.

దేశవాళీ విత్తనాలను అభివృద్ధిచేసి అందించటంలో పాలకులు ఇష్టపూర్వక వైఫల్యం చెందారు. 1966 సంవత్సరం వరకు తాము పండించిన పంటల నుండే రైతులు పూర్తిగా విత్తన సేకరణ చేసుకొనేవారు. అధిక దిగుబడులు, సస్యవిప్లవం పేరుతో సామ్రాజ్యవాదుల ప్రయోజనాలకు అనుగుణంగా విదేశాల నుండి హైబ్రీడ్ విత్తనాల దిగుమతి ప్రారంభం కావటంతో తమ పంటల నుండే విత్తనాలు సేకరించుకునే రైతాంగం క్రమంగా వైదొలగటం ప్రారంభమైంది. మార్కెట్‌లో విత్తనాల కొనుగోళ్ళు ప్రారంభమైనాయి. అధిక దిగుబడుల కోసం రసాయనిక ఎరువుల వాడకం ఎక్కువైంది. ఎటువంటి పరీక్షలు లేకుండా విత్తనాల దిగుమతి వలన, వాటినుండి కొత్త తెగుళ్ళు వ్యాపించి వాటి నివారణకు పురుగుమందుల వాడకం ఎక్కువైంది. సరళీకృత ఆర్థికవిధానాలు, ప్రపంచ వాణిజ్య ఒప్పందం, వ్యవసాయ ఒడంబడిక ఫలితంగా బహుళజాతి సంస్థల హైబ్రీడ్ విత్తనాలతో పాటు ప్రమాదకరమైన బి.టి. విత్తనాలను ఉత్పత్తిచేసి వెనుకబడిన దేశాల మార్కెట్లను ముంచెత్తారు. భారత పాలకులు అందుకు ద్వారాలు బార్లా తెరిచారు. దేశవాళీ విత్తనాలు కనుమరుగయ్యాయి. బహుళజాతి సంస్థల ప్రచారహోరు ఫలితంగా ఇప్పటికీ అనేక పంటల నుండి తిరిగి విత్తనాలు కట్టుకొనే అవకాశం ఉన్నా రైతులు కంపెనీల వద్దే విత్తనాలు కొంటున్నారు. ఇందుకు ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉంది. పేటెంట్ పేరుతో బి.టి. విత్తనాల నుండి తిరిగి విత్తనం కట్టుకొనే హక్కు రైతాంగానికి లేకుండా పోయింది. విదేశీ విత్తన ప్రచారం వలన నకిలీ విత్తనాలు మార్కెట్‌ని ముంచెత్తటంతో రైతాంగానికి పంటనష్టం విపరీతంగా జరుగుతున్నది. బహుళజాతి సంస్థలు విత్తన వ్యాపారం ద్వారా లాభాల రూపంలో వేలాది కోట్ల రూపాయలు తరలించుకుపోయి, దేశంలో పత్తిపంటపై బి.టి. విత్తనాలు పూర్తి ఆధిపత్యం చలాయిస్తున్నాయి.

పంట నష్టానికి కారణాలను కూడా నివేదికలో వివరించారు. రైతాంగానికి సంభవించిన నష్టాన్ని పేర్కొన్నారు. ప్రతి వెయ్యిమంది రైతు కుటుంబాల్లో వివిధ రూపాల్లో ఎన్ని కుటుంబాలు నష్టపోయిందీ వెల్లడించారు.

పంట నష్టాలకు కారణాలను పరిశీలించినప్పుడు మూడు ముఖ్యమైన అంశాలు ముందుకు వస్తున్నాయి. వర్షాభావం, ప్రకృతి వైపరీత్యం, తెగుళ్ళ వలన 95 శాతం పైగా పంటలకు నష్టం జరుగుతున్నది. ఈ నష్టాలను చాలావరకు తగ్గించవచ్చును. అందుకు నిర్దిష్టమైన, సరైన విధానాలు పాలకులు తీసుకోవాలి. దేశ పాలకులకు లోపించింది అదే. అందువలనే పంటలకు నష్టం విపరీతంగా జరుగుతున్నది. వర్షాభావం, కరువు, ప్రకృతి వైపరీత్యాలకు అవినాభావ సంబంధం ఉంది. దేశంలో లభ్యమయ్యే సహజ నీటివనరులను, వర్షం, వరదల నీటిని నిల్వచేసే విధంగా చెరువులు, బావులు, రిజర్వాయర్లు, ప్రాజెక్టులు నిర్మాణం జరగాలి. అప్పుడు భారీవర్షాలకు, తుఫాన్, వరదల వలన సంభవించే పంట నష్టాన్ని తగ్గించటమే కాకుండా వర్షాభావ పరిస్థితులు ఏర్పడినప్పుడు నిల్వచేసిన నీటిని సాగు, త్రాగునీరుకు విడుదల చేయటం ద్వారా కరువు పరిస్థితులను ఎదుర్కొని నష్టాన్ని గణనీయంగా తగ్గించవచ్చును. కేంద్ర – రాష్ట్ర పాలకులు అలాంటి విధానాలు అనుసరించని ఫలితంగా పంటనష్టం పెద్దఎత్తున జరుగుతున్నది. పంటలకు వ్యాపించే తెగుళ్ళవలన కూడా పంటలకు అపార నష్టం ఏర్పడుతున్నది. అందుకూ పాలకులే బాధ్యత వహించాలి. దేశంలోని వివిధ ప్రాంతాల, రాష్ట్రాల వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా తెగుళ్ళను తట్టుకొనే విధంగా దేశవాళీ విత్తనాలను అభివృద్ధిచేసి రైతులకు అందించటం ద్వారా తెగుళ్ళను నియంత్రించి వాటి నష్టాలను పరిమితం చేయవచ్చు. భారత పాలకులు ఈ విధానాలకు తిలోదకాలు ఇచ్చారు. సామ్రాజ్యవాదుల, వారి బహుళజాతి కంపెనీల ప్రయోజనాలకు అనుగుణంగా వ్యవసాయరంగాన్ని మలచి, విదేశీ విత్తనాల విక్రయాలకు తలుపులు బార్లా తెరిచారు. అవి మన దేశ వాతావరణానికి అనుకూలంగా లేకపోవటం, వాటి నుంచి సంక్రమించే కొత్త తెగుళ్ళ వలన పంటలకు విపరీతమైన నష్టం జరుగుతున్నది. తెగుళ్ళ నివారణకు పురుగుమందుల వాడకం ఎక్కువైంది. 2008–09 సం॥లో వీటి వాడకం 8,374 టన్నులు కాగా 2013–14 నాటికి 10 వేల టన్నులకు పెరిగింది. ఆంధ్రప్రదేశ్‌లో తెగుళ్ళ నివారణకు ఎకరాకి పురుగుమందుల కోసం 5 వేల రూపాయలు రైతులు ఖర్చు చేయాల్సి వస్తున్నది. తెగుళ్ళ నివారణకు వాతావరణ పరిస్థితులకు అనుగుణమైన దేశీయ విత్తనాలే పరిష్కారం. (చూడండి 5–3–2015 జనశక్తి)

పంటల బీమా పథకాన్ని కూడా జాతీయ నమూనా సర్వే పేర్కొంది. రైతులకు దీనిపై ఏమాత్రం అవగాహనలేదని, కొద్దిమంది మాత్రమే బీమా చేశారని పేర్కొన్నారు. దేశంలో వరి, గోధుమ ప్రధాన పంటలు. ఈ పంటల రైతులు 5% కూడా బీమా చేయలేదని, బీమా విధి విధానాలు గందరగోళంగా ఉన్నాయని, చాలామంది రైతులకు ప్రీమియం చెల్లించటానికి కూడా డబ్బులు లేవని, అనేక కారణాల వలన బీమాకు దూరంగా ఉన్నారని పేర్కొంది. ప్రతి వెయ్యి కుటుంబాల్లో పంటల వారీగా బీమా చేసిన రైతుల సంఖ్యను వివరించింది.

ఈ లెక్కలను గమనిస్తే పంటల బీమా పథకం తీరుతెన్నులు, పథకంలో రైతుల చేరిక స్పష్టమౌతున్నది. పంటల బీమా పథకం రైతుల మేలు కోసమే ప్రవేశపెట్టామని ప్రచారం చేసుకొన్న యు.పి.ఎ. ప్రభుత్వ, "ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన" పేరు మార్చి ఎన్.డి.ఏ ప్రభుత్వం ప్రకటించిన కొత్తపంటల బీమా పథకం ఆచరణలో రైతుల ప్రయోజనంకన్నా బీమాకంపెనీల, భూస్వాముల, బ్యాంకుల ప్రయోజనాలకే ఉపయోగపడుతుంది. ఎన్.డి.ఏ ప్రభుత్వ కొత్త బీమా పథకం రైతాంగానికి ఎంతో మేలు చేసి వారి జీవితాల్లో పెద్ద మార్పు తీసుకొస్తుందని ప్రధానమంత్రి చెప్పటమే కాకుండా, బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంలో కూడా ఈ పథకాన్ని ఎంతో గొప్పగా చెప్పుకొచ్చారు. ఈ పథకం యొక్క బూటకత్వాన్ని "జనశక్తి" 5–2–2016 సంచికలో వివరించింది.

'ప్రధానమంత్రి ఫసల్ యోజనా పథకం' రైతుల ప్రయోజనాలకు కాకుండా వారి డబ్బుతో బీమా కంపెనీలకు నిధులను సమకూర్చి పెట్టి వాటి లాభాలకు తోడ్పడుతుందని, బ్యాంక్‌లకు గ్యారంటీ ఇస్తుందనీ, భూస్వాములకు లబ్ధి చేకూరుస్తుందనే వాస్తవాన్ని వివరించింది.

జాతీయ నమూనా సర్వే ఇంకా తన నివేదికలో భూ సంబంధాలను కూడా వివరించింది. 69 శాతం రైతులకు హెక్టారుకన్నా తక్కువ ఉందని, సాగునీటి వసతి ఉన్న భూమిశాతాన్ని పేర్కొంది. నివేదిక వెల్లడించిన భూ సంబంధాలు విప్లవ భూ సంస్కరణల ఆవశ్యకతను, భూమి యొక్క ప్రాముఖ్యతను తెలియచేస్తున్నది. ఈ విషయాన్ని "జనశక్తి" నిరంతరం ప్రజలకు వివరిస్తూనే ఉంది.

మొత్తంమీద రైతాంగం ఎదుర్కొంటున్న దుస్థితిని జాతీయ నమూనా సర్వే ప్రతిబింబిస్తోంది.

రైతాంగం సేద్యం సజావుగా సాగాలంటే దేశ వాతావరణానికి అనుకూలమైన దేశీయ విత్తనాల ఉత్పత్తి జరగాలి. రైతాంగానికి అవసరమైన మేరకు సంస్థాగత రుణాలు 4 శాతం వడ్డీ అందించాలి. వడ్డీ అసలుకు మించకూడదు. పంటలకు న్యాయమైన ధరలు ప్రకటించి ప్రభుత్వ సంస్థలే కొనుగోలు చేయాలి. పంటల బీమా పథకాన్ని ఉత్పత్తి ఖర్చులకు కాకుండా మొత్తం పంట విలువకు వర్తింపచేయాలి. నిబంధనలను రద్దుచేసి ప్రతి పంటకు ప్రతి సంవత్సరం నష్టానికి అనుగుణంగా పూర్తి పరిహారం చెల్లించాలి. బీమా సంస్థలు కాకుండా ప్రభుత్వమే ఆ బాధ్యత చేపట్టాలి. ఇందుకోసం రైతాంగం సమైక్యంగా ఉద్యమించాలి.

**ప్రతి వెయ్యి వ్యవసాయ కుటుంబాల్లో పంట నష్టానికి కారణాలు**

| పంట | వర్షాభావం కరువు | తెగుళ్ళు | ప్రకృతి వైపరీత్యం | ఇతర కారణాలు | సరాసరి నష్టం (రూ॥లో) |
|---|---|---|---|---|---|
| వరి | 539 | 245 | 175 | 40 | 7.363 |
| జొన్న | 760 | 114 | 100 | 26 | 12,252 |
| మొక్కజొన్న | 497 | 313 | 145 | 45 | 7,323 |
| చెరకు | 479 | 356 | 135 | 31 | 42,887 |
| వేరుశనగ | 803 | 90 | 84 | 23 | 28,721 |
| సోయాబీన్ | 470 | 210 | 245 | 67 | 18,034 |
| పత్తి | 760 | 136 | 76 | 28 | 43,046 |

ఆధారం : 27-2-16 ఈనాడు

**ఖరీఫ్ పంటలను విక్రయించిన విధానం (శాతాల్లో)**

| పంట | స్థానిక వ్యాపారి | మండి | డీలర్లు | ప్రభుత్వ ఏజన్సీలు | ఇతరులు |
|---|---|---|---|---|---|
| వరి | 41 | 29 | 8 | 17 | 5 |
| జొన్న | 76 | 16 | 3 | 1 | 4 |
| మొక్కజొన్న | 46 | 39 | 12 | 2 | 1 |
| పత్తి | 48 | 26 | 15 | 8 | 2 |
| వేరుశనగ | 44 | 30 | 22 | 3 | 1 |
| సోయాబీన్ | 36 | 59 | 4 | 1 | 0 |
| చెరకు | 18 | 4 | 1 | 50 | 27 |

ఆధారం : ఈనాడు 27-2-2016

**ప్రతి వెయ్యి రైతు కుటుంబాల్లో ఖరీఫ్ విత్తనాల సేకరణ**

| పంట | సొంతభూమి | స్థానికవ్యాపారులు | డీలర్ | ప్రభుత్వసంస్థ | ఇతరులు |
|---|---|---|---|---|---|
| వరి | 372 | 473 | 71 | 63 | 17 |
| జొన్న | 249 | 570 | 95 | 45 | 27 |
| మొక్కజొన్న | 405 | 413 | 90 | 69 | 14 |
| పత్తి | 10 | 705 | 249 | 31 | 05 |
| వేరుశనగ | 352 | 423 | 42 | 179 | 2 |
| సోయాబీన్ | 273 | 571 | 106 | 33 | 18 |
| చెరకు | 523 | 366 | 19 | 19 | 40 |

ఆధారం : ఈనాడు 27-2-16

**ప్రతి వెయ్యి కుటుంబాల్లో పంటలవారీగా**
**బీమా చేసిన రైతులు**

| పంట | ఖరీఫ్ | రబీ |
|---|---|---|
| వరి | 48 | 39 |
| జొన్న | 79 | 34 |
| మొక్కజొన్న | 46 | 31 |
| గోధుమ | 47 | 41 |
| వేరుశనగ | 245 | 100 |
| సోయాబీన్ | 140 | - |
| పత్తి | 104 | 149 |

ఆధారం : ఈనాడు 27-2-2016

****